భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 18.0


భీమవరం ఇళ్లకు నీలి రంగులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)


తాడేపల్లిగూడెం టిడ్కో గృహ సముదాయం

ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో చేపడుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణంపై జగన్ సర్కార్ పూర్తిగా విఫలమైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి చేసిన ఈ ఇళ్లను మూడున్నరేళ్ల తర్వాత ఈ ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసింది. పోనీ ఇచ్చిన ఇళ్లకైనా కనీస మౌలిక సదుపాయాలు కల్పించారా అంటే అదేమీ లేదు. ఇప్పుడు ఎంతో గొప్పగా మేం టిడ్కో ఇళ్లను నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు అందించాం అంటూ గొప్పగా ప్రచారం చేస్తోంది. ఆంధ్రజ్యోతి పరిశీలనలో తేలిందేమిటంటే..

టిడ్కో ఇళ్లు సమస్యల గూళ్లు

- టీడీపీ హయాంలో 90 శాతం నిర్మాణం పూర్తి
- పూర్తయిన ఇళ్లు ఇచ్చేందుకు మూడున్నరేళ్లు
- ఎన్నికలు వస్తున్నాయంటూ హడావుడి
- తూతూ మంత్రంగా లబ్ధిదారులకు అందజేత
- మౌలిక సదుపాయాల లేమితో ప్రజల పాట్లు
- కాని, అద్భుతమంటూ జగన్ సర్కార్ ప్రచారం

ఆంధ్రజ్యోతి పరిశీలన

టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో 19,872 టిడ్కో ఇళ్లను మంజూరు చేశారు. దాదాపు 75 శాతం నిర్మాణాలు పూర్తవగా, వీటిలో ఆరు వేల ఇళ్లను పూర్తిచేశారు. మిగిలిన ఇళ్లల్లో కేవలం అంతర్గత పనులు మాత్రమే చేయాల్సి వుంది. ఈలోగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పూర్తయిన వాటిని లబ్ధిదారులకు అప్పగించడానికి ఈ సర్కార్‌కు మూడన్నరేళ్లు పట్టింది. ఏడాది క్రితం లబ్ధిదారులకు టీడీపీ హయాంలో పూర్తయిన 5,752 ఇళ్లను అప్పగించారు. ఈ ప్రభుత్వ హయాంలో కేవలం 4,128 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన ఇళ్లల్లో 25 శాతం పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వానికి నాలుగున్నరేళ్లు పట్టింది. ఇంకా అంతర్గత పనులు పూర్తి చేయాల్సి ఉంది. లబ్ధిదారుల నుంచి విమర్శలు వస్తున్నాయన్న ఉద్దేశంతో ఇటీవల పట్టాలు అందజేశారు. ఇళ్లు అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. అంతేతప్ప సమీప భవిష్యత్తులో వాటిలో ఆవాసం ఉండేందుకు అవకాశం లేదు.

మిగిలినవి ఇంకెప్పుడో

భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో ఇంకా పూర్తి చేయాల్సిన టిడ్కో ఇళ్లు 9,992. ఈ ప్రభుత్వ హయాంలో వీటిని పూర్తి చేసే అవకాశం లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లపాటు టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదు. తెలుగుదేశం ముద్ర ఉందన్న దురుద్దేశంతో ఈ దుశ్చర్యకు పాల్పడింది. కాంట్రాక్టర్లకు సొమ్ములు ఇవ్వకుండా నానాతిప్పలు పెట్టింది. ఏజెన్సీలు చేతులెత్తేసే పరిస్థితి కల్పించింది. తీరా ప్రభుత్వం కళ్లు తెరిచేటప్పటికి సమయం దాటిపోయింది. కేవలం ఇళ్ల రంగులను మాత్రమే మార్చారు. వైసీపీ రంగులతో తీర్చిదిద్దారు. అదే శ్రద్ధ ఇంటి నిర్మాణంలో లేకపోయింది. మరో 50 శాతం ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వంలో లబ్ధిదారులకు అప్పగిస్తారన్న ఆశలు సన్నగిల్లాయి. రాబోయే ప్రభుత్వంలోనే ఇళ్లు కేటాయించనున్నారు.


పాలకొల్లులో గృహాల దుస్థితి


వినియోగంలోకి రాని ట్రీట్‌మెంట్ ప్లాంట్

- అభివృద్ధికి ఆమడదూరంలో ఇళ్లు

భీమవరం టౌన్ : ఇటీవల మూడు వేల 840 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. వారి గృహ ప్రవేశాలకు మాత్రం మరింత కాలం ఎదురు చూడాల్సిందే. టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో కొన్ని ప్లాట్‌లకు రంగులు వేస్తున్నారు. పనులు ఇంకా పూర్తి చేయాలి. పట్టాలు ఇచ్చినపుడు త్వరలోనే ఇళ్లను అప్పగిస్తామని చెప్పినా అదీ జరిగేలా లేదు. ఇంకా రెండు వేల మందికి పట్టాలు ఇవ్వాలి. మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఉన్నప్పటికి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దీని కారణంగా దోమలు, పురుగులు, పాములు వంటి వాటి బెడద అధికంగా వుంది.


ఛిద్రంగా మారిన టిడ్కో గృహాలకు వెళ్లే రోడ్డు

లబ్ధిదారులకు సిబిల్ దెబ్బ

వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని లబ్ధిదారులు సిబిల్ స్కోర్‌ను కోల్పోయారు. లబ్ధిదారుల పేరుతో రుణాలు తీసుకున్నారు. వాటికి సంబంధించిన వాయిదాలను లబ్ధిదారులు చెల్లించాలి. ఇళ్లు అప్పగించే వరకు వడ్డీ చెల్లిస్తామంటూ ప్రభుత్వం ముందుకొచ్చింది. సకాలంలో వడ్డీ విడుదల చేయలేదు. లబ్ధిదారులకు బ్యాంకులు నోటీసులు జారీ చేస్తున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల పేరుతో రుణాలు మంజూరయ్యాయి. వారికి ఇళ్లు మాత్రం అప్పగించకపోవడంతో రుణాలు మొండి బకాయిలుగా మారాయి. లబ్ధిదారులు వాయిదాలు చెల్లించలేదు. ఇల్లు అప్పగించకుండా వాయిదాలు ఎందుకు చెల్లించాలంటూ నిలదీశారు. మొత్తంగా వైసీపీ నిర్వాకానికి లబ్ధిదారుల సిబిల్ స్కోర్ దెబ్బ తింది. కొత్తగా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఇలా లబ్ధిదారులు రుణ పరపతిని కోల్పోయారు. గతంలో సూక్ష్మ రుణ సంస్థల్లో అప్పులు తీసుకుని లబ్ధిదారులు తమ వంతు భాగాన్ని ప్రభుత్వానికి చెల్లించారు. టిడ్కో ఇళ్లలో 365 చదరపు అడుగులకు రూ.50 వేలు, 430 చదరపు అడుగుల ప్లాట్‌కు రూ.లక్ష వంతున లబ్ధిదారులు చెల్లించారు. ఆ మొత్తాన్ని సూక్ష్మ రుణ సంస్థల నుంచి అప్పుగా తీసుకున్నారు. ప్రభుత్వం సకాలంలో ఇళ్లు ఇవ్వకపోవడంతో అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించలేక

రుణభారం

పోయారు. ఇది కూడా సిబిల్ స్కోర్‌పై ప్రభావం చూపింది. అటువంటి వారికి బ్యాంకులు రుణాలు ఇవ్వలేదు. ఫలితంగా వారి పేరుతో ఉన్న టిడ్కో ఇంటిని పొందలేకపోయారు. మరోవైపు తెలుగుదేశం హయాంలో అర్హులుగా వున్న లబ్ధిదారులకు ఇప్పుడు వయసు అధికమైంది. దీనివల్ల బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ససేమిరా అన్నాయి. అటువంటి లబ్ధిదారులకు తమ బంధువుల పేరుతో ఇళ్లు మార్చుకోవడానికి అవకాశం కల్పించారు. అది కూడా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేదు. దీంతో టిడ్కో ఇళ్లకు దూరమవుతున్నారు. ప్రభుత్వం చేసిన తప్పిదానికి లబ్ధిదారులు బలైపోతున్నారు.

గృహాలు పూర్తి కాకుండానే లబ్ధిదారులపై బ్యాంక్ రుణభారం పడింది. ఇచ్చిన గృహ పట్టాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు రుణం ఇప్పించి ఆ సొమ్మును నేరుగా ప్రభుత్వ ఖాతాల్లోకి మళ్ళించారు. దీంతో లబ్ధిదారులు చేతికి సొమ్ములు రాకుండానే రుణగ్రస్తులయ్యారు. వీరిలో కొందరికి గృహాలను ఇప్పటి వరకు అప్పగించలేదు. అయినప్పటికి రుణ వాయిదాలు చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు అందుతున్నాయి. లబ్ధిదారులు ఇంటి అద్దె కట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో బ్యాంకు వాయిదాలు ఏ విధంగా చెల్లించగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం వాయిదాల సొమ్ము చెల్లించకపోతే గృహాలను వేలం వేస్తామని బెదిరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు గందరగోళ పరిస్థితుల్లోకి వెళుతున్నారు.

పాలకొల్లులో తుప్పల మధ్య గృహాలు ఇలా



పాలకొల్లులో ఏవీ మౌలిక వసతులు

పాలకొల్లు : గత టీడీపీ ప్రభుత్వం పాలకొల్లులో 7,159 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా 90 శాతం పూర్తి చేసింది. ఈలోగా వైసీపీ ప్రభుత్వం రావడంతో మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడంలో విఫలమైంది. గత ప్రభుత్వంలోనే పూర్తయిన రెండు వేల ఇళ్లను తొలి విడతగా లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రెండో విడతలో అసంపూర్తిగా వున్న కొన్ని ఇళ్లను లబ్ధిదారులకు తాళాలు అందిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గృహాల్లో నివాసం ఉండే పరిస్థితి లేదు. దీంతో లబ్ధిదారులు ఎపుడు పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరుగుతాయో ? ఎపుడు గృహాల్లోకి వెళతామోనని ఆశతో ఎదురుచూస్తున్నారు. టిడ్కో గృహాల సముదాయ ప్రాంతంలో మౌలిక సౌకర్యం లేక అక్కడ నివాసితులు నిత్యం కష్టాలను అనుభవిస్తున్నారు. తాగునీరు, డ్రెయిన్లు, ఆరోగ్య కేంద్రం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు వంటి అనేక మౌలిక సదుపాయాలు నోచుకోలేదు. దీంతో అక్కడ నివాసం ఉంటున్న కొంత మంది నిత్యం తాగునీటి ఇబ్బందులు అనుభవిస్తున్నారు. ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో అనారోగ్యం వస్తే దూరంలో గల ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఇలా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ఇదీ పాలకొల్లులో పరిస్థితి.



స్లాబు లీకేజి సమస్యతో పై అంతస్తులోకి ఎవరూ కాపురాలకు రావడం లేదు. కొందరు వచ్చినా నీరు లీకవడంతో ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను అడుగుతుంటే పట్టించుకోవడం లేదు.

\- బి.కొండమ్మ, టిడ్కో ఇళ్ల నివాసి, తాడేపల్లిగూడెం


తాడేపల్లిగూడెంలో అరకొరగా డ్రెయిన్ నిర్మాణం

- ఇళ్ల చుట్టూ సమస్యల తిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్ : వైసీపీ ప్రభుత్వానికి రంగులు వేయడంపై ఉన్న శ్రద్ధ టిడ్కో ఇళ్ల సముదాయాల్లోని సమస్యలను పరిష్కరించడంలో కనిపించడం లేదు. తాడేపల్లిగూడెం టిడ్కో ఇళ్ల చుట్టూ సమస్యలు తిష్టవేశాయి. ముఖ్యంగా మెయిన్ డ్రెయిన్ లేకపోవడంతో భారీ వర్షాలు కురిస్తే నీరంతా ఈ ప్రాంతంలోని ఇళ్ల మధ్యనే ఉంటుంది. ఇళ్ల చుట్టూ తుప్పలు పెరిగాయి. వీటిలో పెద్ద సంఖ్యలోనే పాములు సంచరిస్తున్నాయి. అవి జనం మధ్యకు, ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. పైకప్పులు లీకేజీలు ఉండటంతో పైఅంతస్తులో నివాసం ఇబ్బందికరంగా మారింది. స్థానికులు ఈ సమస్యను ఎల్‌అండ్‌టీ అధికారులకు చెబితే వాటిని మున్సిపల్ అధికారులు చూస్తారని చెబుతున్నారు. మున్సిపల్ అధికారులను అడిగితే ఎల్‌అండ్‌టీ అధికారులను అడగమని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. పైపులైన్లను సగానికి పైగా గృహాల మధ్యలోనే వదిలేశారు. ఎన్నికల ముందు అందరికి టిడ్కో ఇళ్లు అందిస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.



కాంగ్రెస్ అస్త్రం.. పోలవరం డిక్లరేషన్

- జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై సమర శంఖారావం
- గిరిజన, గిరిజనేతర రైతుల మద్దతు దిశగా వ్యూహం
- నోటిఫికేషన్‌కు ముందే భారీ బహిరంగ సభకు ప్లాన్
- రాహుల్‌తోపాటు, ప్రియాంక హాజరయ్యేలా యత్నాలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సార్వత్రిక ఎన్నికలకు వచ్చే నెల రెండో వారంలో నగారా మోగబోతోంది. ప్రధానపక్షాలన్నీ తమ ప్రచారాన్ని మరింత ఉధృతం చేయబోతున్నాయి. సాధ్యమైనంత మేర జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పొప్పులను, ప్రజా మోసాలతోపాటు పోలవరం ప్రాజక్టు నిర్మాణం నిలిచిపోవడాన్ని ప్రధాన ఎన్నికల అస్త్రంగా ప్రతిపక్షాలన్నీ సంధించబోతున్నాయి. పోలవరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఓ డిక్లరేషన్ ఇవ్వాలని భావిస్తోంది. నిర్మాణ పనులు నిలిచిపోవడం, నిర్వాసిత కుటుంబాలు ఆగమాగమం కావడం, నష్టపరిహారం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంచడం వంటి అంశాలన్నిటినీ ఏకరవు పెట్టాలని భావిస్తోంది. వాస్తవానికి గత ఐదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ పోలవరం నిర్లక్ష్యానికి ప్రధాన నిందితులుగా చూపేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ప్రత్యేకించి పోలవరంపై ఒక సమగ్ర డిక్లరేషన్ ప్రకటించాలని ఆ పార్టీ అగ్రనేతలు ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. దాదాపు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరందించడం, 340 గ్రామాలకు తాగు నీరు అందించడం, విద్యుత్ ఉత్పత్తి సాధించడం ఇదే తరుణంలో రాష్ట్ర ముఖ చిత్రం మారేలా మరిన్ని ప్రాంతాలకు సాగు, తాగునీటి సరఫరాకు అనువుగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాలని అందరూ ఆకాంక్షించారు. ప్రత్యేకించి పోలవరం నిర్మాణం రాష్ట్ర విభజనానంతరం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. 2019 నుంచి ఇప్పటివరకు పనుల పురోగతి మూలనబడింది. నిధుల కేటాయింపులు అంతంత మాత్రంగానే మిగిలాయి. గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు ఎన్నికల ముందు, ఆ తర్వాత వైసీపీ అధ్యక్ష, సీఎం హోదాలోనూ జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు గుప్పించారు. ఈ మాటలతోనే పోలవరం వంటి నియోజక వర్గాల్లో వైసీపీ గెలిచేలా చూశారు. పోలవరానికి అన్నీ త్యాగం చేసిన కుటుంబాలు ఎక్కడికక్కడే మిగిలాయి. సహాయ పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి) కింద చెల్లించాల్సిన లక్షలాది రూపాయలను ఇప్పటికీ చెల్లించలేదు. ప్రాజెక్టులో 2014-19 మధ్య రోజుకు మూడు వేల మందికి పైగా కార్మికులు, 500 పైగా వాహనాలు నిత్యం పనిచేశాయి. కరోనా దగ్గర నుంచి ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం చడీ చప్పుడు లేకుండా నిశ్శబ్దమైంది. కేంద్ర నిపుణుల కమిటీలు డజన్ల సంఖ్యలో ప్రాజక్ట్ స్థలిని సందర్శించినా పురోగతి లేదు. పోలవరం ప్రాజెక్టుకు ఎందుకిలా జరిగిందో సామాన్యుడికి కూడా ఇప్పటికే అర్థమైపోయింది. రైతువారీ కుటుంబాలు ఎన్నో కలలు కన్నా, జగన్ సర్కార్ మాత్రం వీరి ఆశలను గోదారి పాలు చేసింది.



ఎండగడదాం.. ముందు నిలుద్దాం..

పోలవరం ప్రాజెక్టును గడచిన ఐదేళ్లలో జగన్ సర్కార్ ఎలా గాలికి వదిలేసిందో, కేంద్రం చూసీ చూడనట్లుగా ఎలా ప్రేక్షక పాత్ర వహించిందో జనం ముందుకు తేవాలని భావిస్తోంది. దీనిలో భాగంగానే గిరిజనులు, గిరిజనేతరులు, రైతులతో జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని యోచిస్తోంది. ఈ సభలోనే పోలవరం డిక్లరేషన్ ప్రకటించాలని ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. వీలైతే పోలవరం డిక్లరేషన్ సభకు యువనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ హాజరయ్యేలా చూడాలని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నారు. ప్రత్యేకించి పోలవరాన్ని అందుకోగలిగితే అలవోకగా వివిధ వర్గాల సంఘీభావం పొందగలుగుతామని పార్టీ సీనియర్లు ఈ దిశగానే అడుగులు వేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మార్చి రెండో వారంలో వెలువడే అవకాశాలున్నందున ఆలోపే డిక్లరేషన్ సభ పెట్టాలని భావిస్తున్నారు. అనంతపురంలో ఈనెల 26న ఎన్నికల శంఖారావం పూరిస్తుండడంతో వచ్చే నెలలోనే మరో భారీ బహిరంగ సభకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పూర్తిగా చర్చించిన తర్వాత తేదీ ఖరారు కావచ్చని భావిస్తున్నారు. ఆలోపే వివిధ నియోజక వర్గాల నుంచి పోటీ చేయదలచిన అభ్యర్థుల ఖరారు ఒక కొలిక్కి వస్తుందని, ఇది కూడా వారందరికీ ఒక టానిక్‌లా పని చేసేలా ఉండాలని కాంగ్రెస్ భావిస్తోంది.

టిక్కెట్ల కోలాహలం

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలలో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఆఖరి గడువు ఈ నెల తొమ్మిది కాగా, దీనిని ఈ నెల 29 వరకు పొడిగించారు. రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు వచ్చిన దరఖాస్తులలో అత్యధికంగా ఎనిమిది, అత్యల్పంగా రెండుగా తెలుస్తోంది. కైకలూరు నుంచి గాంధీ, నాగరాజు, నిరీక్షణ, ఏలూరు నుంచి రాజనాల రామ్మోహనరావు మరికొందరు, దెందులూరు నుంచి డీవీఆర్ చౌదరి, ఆలపాటి నరసింహమూర్తి, ఉంగుటూరు నుంచి హరికుమార్‌రాజు తోపాటు కాంగ్రెస్‌వాది దివంగత నేత చింతలపాటి మూర్తిరాజు మనవడుతో సహా ఇంకొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. లోక్‌సభ స్థానాలకు ప్రత్యేకించి పోటీ అంటూ లేదు.

ఉద్యోగుల ఉద్యమ శంఖారావం

సీఎం జగన్ మొండి వైఖరి దారుణం

భీమవరం, ఏలూరుల్లో ఏపీ జేఏసీ నాయకుల ధర్నాలు

భీమవరం ఫిబ్రవరి 17 : ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల చెల్లింపులో సీఎం జగన్ మొండి వైఖరి దారుణమని భీమవరం తాలూకా ఏపీజేఏసీ నాయకులు విమర్శించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న ఆందోళనల్లో భాగంగా శనివారం భీమవరం ప్రకాశం చౌక్‌లో ధర్నా నిర్వహించారు. తాలూకా జేఏసీ ఛైర్మన్ వి.జానకిరామ్ మాట్లాడుతూ 'సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉండగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. తర్వాత వాటిని అమలు చేయకపోగా, ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న రూ.22 వేల కోట్లను తమ అవసరాలకు ఇవ్వకుండా ప్రభుత్వం వాడుకోవడం శోచనీయం. మాకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని అడిగితే మొండిగా వ్యవహరిస్తున్నారు. జీతాలలో కోత, హెచ్‌ఆర్‌ఏలో కోత, ఐఆర్‌లో కోతలు పెడుతున్నారు. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏలు, ఐదేళ్లకు ఒకసారి ఇవ్వాల్సిన పీఆర్‌సీ ఇవ్వడం లేదు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని అధికారంలోకి వచ్చి.. ఉద్యోగులను శత్రువులు గా చూస్తోంది. ఎన్నికలకు రోజుల వ్యవధి మాత్రమే వుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలి. లేని పక్షంలో జగన్ ఎన్నికలకు ఎలా సిద్ధం అంటున్నారో.. అలాగే ఉద్యోగులు కూడా దేనికైనా సిద్ధమేనని అంటారు. సమస్యలు పరిష్కరించకుం టే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది' అని హెచ్చరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులు ఈ నెల 20న జిల్లాస్థాయిలో జరిగే నిరసన ర్యాలీ, కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు, 27న చలో విజయవాడకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎంవి సత్యనారాయణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు


ఏలూరు జడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా బయలుదేరిన ఏపీజేఏసీ నాయకులు, ఉద్యోగులు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17: మీరు సిద్ధమైతే మేము సిద్ధమేనంటూ ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు గర్జించారు. ఉద్యమ శంఖారావంలో భాగంగా నాలుగో రోజు శనివారం ఏపీ ఎన్జీవోలు, పంచాయతీరాజ్, ఏపీజీఎల్‌ఐ, వ్యవసాయ, ట్రెజరీ, ఆర్‌అండ్‌బీ, ఉపాధ్యాయులకుతోడు పెన్షనర్లు ఏలూరు కలెక్టరేట్ వద్ద భారీ ఆందోళన చేశారు. తొలుత జడ్పీ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని నిరసన తెలిపారు. ఏపీ జేఏసీ ఛైర్మన్ కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి రోడ్డున పడే పరిస్థితికి ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చర్చలకు పిలువకుంటే మెరుపు సమ్మెకైనా సిద్ధమని హెచ్చరించారు. ఈనెల 27న జరిగే చలో విజయవాడకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

177 మందికి నోటీసులు

ఈ నెల 27 చలో విజయవాడ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉద్యోగ సంఘాల నాయకులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. జిల్లావ్యాప్తంగా 177 మందికి పోలీసులు నోటీసులు జారీచేశారు. 17 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. దీనిపై ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చలో విజయవాడకు అనుమతుల్లేవు : ఎస్పీ

భీమవరం క్రైం : ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ ఆందోళనలకు అనుమతులు లేవని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో వున్న నేపథ్యంలో అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయరాదని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ వరలక్ష్మి

సార్వాకు నూతన వరి వంగడం

మార్టేరు వరి పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ వరలక్ష్మి

పెనుమంట్ర, ఫిబ్రవరి 17 : బొండాలు రకానికి ప్రత్యామ్నాయంగా సార్వాలో నూతన రకాన్ని రూపొందించామని ఈ రకం 1000 గింజలు కలిగి బరువు సుమారుగా 24 గ్రాములు ఉన్నదని చివరి దశ పరిశోధనలో ఉన్నదని మార్టేరు వరి పరిశోధనా స్థానం ప్రధాన సంచాలకురాలు డాక్టర్ ఎం.భరతలక్ష్మి తెలిపారు. శనివారం ఉదయం పెనుమంట్ర మండలం మార్టేరు వరి పరిశోధన స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమం తణుకు ఏడీఏ ఎంవీ రమేష్ అధ్యక్షతన జరిగింది. ప్రస్తుతం చాలా ప్రాంతాలలో జింక్ లోపం కనిపిస్తున్నదని, వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని కోరారు. యంత్రాలతో కోతలు కోస్తూ ఉండటం వల్ల దాళ్వాలో కాండం తొలిచే పురుగు ఎక్కువవుతోందని తెలిపారు. ఈ దాళ్వాలో కొన్ని ప్రాంతాలలో సాగుచేస్తున్న ఆర్ఎన్ఆర్ 15048 రకం పనితీరు గురించి వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిలో ఇతర పురుగు మందులు కలిపి పిచికారీ చేయవచ్చో లేదో తెలియజేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. తణుకు ఏడీఏ .రమేష్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 77,300 హెక్టార్లలో ఎంటీయూ 1121 రకాన్ని సాగు చేశారని, తర్వాత స్థానాలలో పీఆర్ 126, ఎస్ఎల్ 10 రకాలు ఉన్నాయని తెలిపారు. శాస్త్రవేత్తలు శ్రీనివాస్, కృష్ణాజీ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో దుకాణాలు తనిఖీలు చేస్తున్న అధికారులు

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 17: బాలలను కిరాణా షాపులు, హోటళ్లు, మెకానిక్ తదితర పనుల్లో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై బాలకార్మిక (నిషేధ, నియంత్రణ) చట్టం-1986 ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసు కుంటామని కార్మికశాఖ సహాయ అధికారి గోపాలకృష్ణ హెచ్చ రించారు. ద్వారకా తిరుమల కొండపైన, దిగువనున్న దుకాణాలను శనివారం పరిశీలించారు. బాలలను పనుల్లో పెట్టుకుంటే యజమానులకు 6 నెలల నుంచి రెండేళ్లవరకూ జైలుశిక్ష, రూ.20 నుంచి 50వేల వరకూ జరిమానా విధిస్తామన్నారు. అధికారులు వెంకట రమణన్, మోహన్, మహిళా పోలీస్ లక్ష్మీసుజన తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17 : పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ కేంద్ర జిల్లా అధికారి దూలం కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు భవనంలో జరిగే జాతీయ యూత్ పార్లమెంటు ఫెస్టివల్-2024 లో భాగంగా పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 18 నుంచి 25 ఏళ్ల వయసు వారికి ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు Young Voices: Engage and Empower for Nation's Transformation అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఈనెల 20వ తేదీ మంగళవారం ఆన్‌లైన్ వర్చువల్ మోడ్‌లో జరుగుతుందన్నారు. పేరు నమోదు కోసం మొబైల్ నంబర్ 8884763735లో సంప్రదించాలని తెలిపారు.

వైద్య ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ రద్దు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఐడీఎస్‌పీ విభాగంలో ఖాళీగా వున్న ఎపిడిమియాలజిస్టు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీచేసేందుకు ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్ఎంకు సంబందించిన ఉద్యోగ నియామకాల ప్రక్రియను కొత్తగా ఏర్పాటుచేసిన ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా మాత్రమే చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఎపిడిమియాలజిస్టు ఉద్యోగ నియామకాలకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ సంబంధిత నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్టుగా గమనించాలని సూచించారు. వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

బీఈడీ ప్రత్యేక విద్య కోర్సుకు అడ్మిషన్లు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17: రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ రెండేళ్ల బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్యాకోర్సులు 2023-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్‌ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని దొండపాటు పరివర్తన్ బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ఓసీలకు 50 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ వారికి 45 శాతం మార్కులు ఉత్తీర్ణత పొందిన యువతీ యువకులు అర్హులు అన్నారు. ఈ కోర్సు పూర్తి అయిన వారికి ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ, సర్వశిక్ష అభియాన్ (రాజీవ్ విద్యామిషన్)లో ఐఈఆర్టీ రీసోర్స్ ఉపాధ్యాయులుగా, స్వచ్ఛంద సంస్థల్లో ఉపాధి పొందవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99486 00642 నంబర్‌లో సంప్రదించవలసిందిగా కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు..ముగ్గురికి గాయాలు



దెందులూరు, ఫిబ్రవరి 17 : జాతీయ రహదారి సత్యనారాయణపురం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బంధువుల ఇంటికి సామర్లకోట నుంచి కే.సురేంద్ర అతని భార్య, కుమార్తె ముగ్గురూ కారులో వరంగల్ బయలుదేరారు. సత్య నారాయణపురం సమీపంలో పక్కన ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీకొట్టడంతో కారు నడుపుతున్న సురేంద్రతో పాటు అతని భార్య కుమార్తెలకు గాయాలయ్యాయి, స్థానికులు దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

30 లీటర్ల సారా స్వాధీనం..

చింతలపూడి, ఫిబ్రవరి 17 :చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో చింతలపూడి పోలీసులు దాడి జరిపి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ సుధాకర్, ఎస్ఐలు కుటుంబరావు, చెన్నారావులు పాల్గొన్నారు.



తెలవారింది స్వామీ..మేలుకో

శ్రీవారి క్షేత్రంపై హిమసోయగం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 17: మంచు కురిసే వేళ... ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం ప్రకృతి రమణీయ దృశ్యాలతో శోభిల్లింది. తెలవారింది.. ఇక మేలుకో శ్రీనివాసా... అంటూ ఆలయ అర్చకులు స్వామివారిని తెల్లవారుజామున మేల్కొలిపి విశేష పూజాదికాలు జరిపారు. శేషాచలంపై లేలేత రవి కిరణాలను మంచు పొరలు కమ్ముకున్నాయి. శ్రీవారి ఆలయపరిసరాలు, ఘాట్‌రోడ్డు ప్రాంతం, క్షేత్రపాలకుని ఆలయానికి వెళ్లే దారి.. ఇలా పలు ప్రదేశాల్లో దట్టమైన పొగమంచు అలుముకుంది. వేకువజామునే ఘాట్‌రోడ్డులో





చిన వెంకన్న క్షేత్రలో దట్టంగా కమ్ముకున్న మంచు



వాకింగ్‌కు వెళ్లిన గజలక్ష్మి మంచుతెరల నడుమ విహరించింది. ఉదయం 8-30 గంటలు దాటినా భానుడి దర్శనం కలుగలేదు. శనివారం చిన వెంకన్న సన్నిధి భక్తుల రాకతో కళకళలాడింది.శుక్రవారం సాయంత్రానికే పలువురు భక్తులు కాలినడకన క్షేత్రానికి విచ్చేసారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి.దాదాపు 15 వేలమంది పైబడి భక్తులు దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. భక్తుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశం కిటకిటలాడింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి 2 గంటల పైబడి సమయం పట్టింది.



రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిందే

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

పాలకోడేరు, ఫిబ్రవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను చెల్లించడంలో సత్వరం నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించక తప్పదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం హెచ్చరించింది. భీమవరం శివారు గొల్లలకోడేరులో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో శనివారం 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్నలు మాట్లాడుతూ నాడు నేడు పనులు, మిడ్‌డే మిల్స్ పర్యవేక్షణ వంటి పనులకు ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం, 117 జీవో ద్వారా విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాఠశాలల విలీనం ద్వారా పల్లె బడులకు మనుగడకు ముప్పు వాటిల్లిందన్నారు. ఉపాధ్యాయులపై పని భారాన్ని 40 శాతం పెంచడం, విద్యార్థుల సంఖ్య తరగతి గదిలో 60కి పెంచడం, పర్యవేక్షణల పేరుతో ప్రిన్సిపల్ సెక్రటరీ దాడులు, వేధింపులు మధ్య ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. 202 ఉన్నత పాఠశాలలను ప్లస్-2గా ఉన్నతీకరించి పదోన్నతుల ద్వారా పీజీ టీచర్లను నియమించకుండా రీ డిప్లాయిమెంట్ పేరుతో ఒక ఇంక్రిమెంట్ ఇచ్చి నియమించడం, ఇంతవరకు పెరిగిన ఇంక్రిమెంటు చెల్లించకపోవడం దారుణమన్నారు. లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్స్ విషయంలో చొరవ చూపక పోవడం వలన ఉన్న ఉపాధ్యాయులపై తీవ్రమైన పనిభారం పడుతుందన్నారు. పరీక్ష విధానం అయితే మరీ ఘోరంగా మారిందన్నారు. ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి. ఒక క్యాలెండర్ విధాన రూపకల్పన లేక పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో విద్యార్థులకు తెలియని పరిస్థితి నెలకొందన్నారు. యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులు వేధించినట్లే విద్యార్థులు కూడా బైజూస్, టోఫెల్ సిలబస్ ప్రవేశపెట్టి గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులపై పెరిగిన పనిభారాన్ని, ఒత్తిడిలను తగ్గించుకోవడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఒకటిన్నర దశాబ్దం పోరాటం చేసి రద్దు చేసుకున్న అప్రెంటిస్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలనే దుర్మార్గపు ఆలోచనతో ఉన్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ప్రసాద్, సుబ్రహ్మణ్యంరాజు, గంటా మోహన్, రామచంద్రరావు, చంద్రశేఖర్, ఎర్రయ్య, వివిధ జిల్లాల నుంచి ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.



ఆచంటలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

మంచు.. ఎండ..చలి

ఆచంట, ఫిబ్రవరి 17: ఈసారి ఫిబ్రవరి ప్రారంభంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండ తీవ్రత పెరగడంతో పాటు ఉక్కబోత కూడా మొదలైంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కారణంగా రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. కొన్ని రోజులుగా ఉదయం పొగ మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం చలి వాతావరణం ఉంటుంది.



మాధవాయిపాలెం రేవు వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లు

అంతర్వేది తిరునాళ్ళకు రేవులో ఏర్పాట్లు

నరసాపురం, ఫిబ్రవరి 17: మాధవాయిపాలెం-సఖినేటిపల్లి మీదుగా అంతర్వేది తిరునాళ్ళకు వెళ్లే యాత్రికుల కోసం నరసాపురం రేవులో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ప్రయాణికులతో పాటు యాత్రికులు పెద్ద సంఖ్యలో తిరునాళ్ళకు వెళ్లే అవకాశం ఉండటంతో రేవులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బారిగేడ్లు ఏర్పాటు చేశారు. రెండు లైన్లతో పాటు పంటులు వచ్చే వరకు ఎండలో నిలబడకుండా టెంట్‌లు వేశారు. మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, రేవుల్లో గజ ఈతగాళ్ళను కూడా ఏర్పాటు చేయనున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్ళకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మాధవాయిపాలెం రేవు గుండా దాటడం ఆనవాయితీ. దానికి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు.

బియ్యపుతిప్ప రేవు మూసివేత

2010లో బియ్యపుతిప్ప వద్ద జరిగిన పడవ ప్రమాదంతో అప్పటి నుంచి ఈ రేవును అంతర్వేది తిరునాళ్ల సమయంలో మూసివేస్తూ వస్తున్నారు. అంతర్వేది వెళ్లేందుకు ఇది దగ్గర మార్గం కావడంతో కృష్ణా జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన చాలామంది యాత్రికులు ఈ మార్గం గుండా గోదావరి దాటి అంతర్వేది వెళుతుంటారు. అయితే సముద్రం కలిసే ప్రదేశం కావడం, లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో అప్పటి నుంచి రేవును మూసివేశారు. రేవులో ఎటువంటి రాకపోకలు జరగకుండా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో పాటు రెవెన్యూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు.

ఒకప్పటి పుణ్యక్షేత్రం.. నేడు మురికి కూపం..

ఇబ్బందులు పడుతున్న భక్తులు



పాలకోడేరు, ఫిబ్రవరి 17 : పాలకోడేరు శివారు మోగల్లు గ్రామం వద్ద ఉత్తర దిశగా ప్రయాణం చేస్తున్న గోస్తని నది ఒకప్పుడు భక్తులతో కిటకిట లాడుతూ పుణ్యక్షేత్రంగా ఉండేది. అటువంటి నది నేడు మురికి కూపంగా తయారై ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. కాశీకి వెళ్లలేని భక్తులంతా దక్షిణ దిశ నుంచి ఉత్తరానికి ప్రవహించే ఈ నదినే మరో కాశీగా భావించి ఆ పుణ్యనదిలో స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకునే వారు. అటువంటి పుణ్యక్షేత్రం నేడు అధ్వానంగా తయా రైంది. అటువంటి పుణ్యక్షేత్ర నది వద్ద పవిత్ర గోస్తని నదీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధపడు తున్నారు. ఒకప్పుడు ఈ గోస్తని నది తీర్థోత్సవాలలో పాల్గొనేందుకు పాల కోడేరు మండల వాసులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి ఎడ్లబండ్ల మీద వచ్చి స్నానాలు ఆచరించేవారని చెబుతుంటారు. ఈ నదీ తీరాన మోద్గల్య మహర్షి తపస్సు చేసిన ప్రాంతంగా పేరుగాంచడంతో ఆ మహర్షిని దర్శిం చుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చేవారని పూర్వీకులు చెబు తారు. చుట్టుపక్కల ఫ్యాక్టరీలు నెలకొల్పడం, ఎగువ నుంచి మురుగు రావడంతో మురికి కూపంగా తయారైందని భక్తులు అంటున్నారు. ఇటువంటి పుణ్యక్షేత్రాన్ని కాపాడే విధంగా ప్రతీఒక్కరూ నడుం బిగించాలని కోరుతున్నారు.



కరపత్రాలు ఆవిష్కరించిన సభ్యులు

19 నుంచి 21 వరకు గోస్తనీ నది తీర్థోత్సవాలు

గోస్తనీ నది వద్ద ఈనెల 19వ తేదీ నుంచి 21 వరకు 93వ తీర్థోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వా హకులు డాక్టర్ గాదిరాజు కృష్ణంరాజు తెలి పారు. వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సభ్యులు మాట్లాడుతూ ఈ పుణ్య నది వద్ద 93 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 19వ తేదీన శ్రీరామచంద్రమూర్తి, వేంకటేశ్వరస్వామి వార్లను పెళ్లి కుమారుడిని చేయడం, దీక్ష ధారణ, ధ్వజారోహణ, తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమా లతో పాటు అన్న సమారాధన, శ్రీకోదండరామ, శ్రీవెంకటేశ్వరస్వామి వార్ల కళ్యాణం, నిర్వహి స్తామన్నారు. గాదిరాజు లక్ష్మణరాజు, సీతారామరాజు, అయ్యగారి హనుమంతరావు, గాదిరాజు సీతారామరాజు, కొత్తపల్లి సూర్య నారాయణ రాజు, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు చూపిస్తున్న పోలీసులు

నాటు తుపాకులు స్వాధీనం..నలుగురు అరెస్ట్

గణపవరం, ఫిబ్రవరి 17: ఆక్వా చెరువులపై పిట్టలను బెదరగొట్టడానికి అక్రమంగా ఆయుధాలు వినియోగిస్తున్న నాలుగు నాటు తుపాకులను గణపవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం గణపవరం పోలీస్‌స్టేషన్‌లో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. గణపవరంలోని చినరామచంద్రపురం వైఎస్సార్ కాలనీలో నాటు తుపాకులు కలిగిన నిందితులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఎటువంటి అనుమతులు లేని నాలుగు నాటు తుపాకులు నలుగురిరి పట్టుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన నక్కల శివకుమార్, తమిళనాడుకు చెందిన మీనంపాతం రవి, అజయ్, నక్కల మురళీ అలియాస్ మక్రాసింగ్‌ను అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. రొయ్యలు, చేపల చెరువులపై పక్షులను వెళ్లగొట్టేందుకు అనుమతులు లేని నాటు తుపాకులు ఉపయోగిస్తే చెరువుల యాజమానులపైనా ఆయుధాల చట్టం కింద చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.



కవిటంలో అతిరుద్ర మహా యాగం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా కోటప్పకొండ కోటేశ్వరస్వామి కల్యాణం



పోడూరు, ఫిబ్రవరి, 17 : పోడూరు మండలం కవిటంలో అతిరుద్ర మహా యాగం మహోత్సవాలు 7వ రోజు శనివారం ఘనంగా జరిగాయి. వేద పండితులు రుద్రహోమం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుత్వికులచే రుద్ర పారాయణలు ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. అతి రుద్ర యాగ మహోత్సవాల్లో భాగంగా రాత్రి 7 గంటలు నుంచి మేళ తాళాలతో, పండితుల మంత్రోచ్ఛనలతో భక్తజన సందోహం మధ్య కన్నుల పండువుగా కోటప్పకొండ మహా క్షేత్రంలో వెలసిన పార్వతీ సహిత కోటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించారు.

అయినవారికి ఆపరేటర్ పోస్టు

దూసనపూడి పంచాయతీలో పంపు ఆపరేటరు పోస్టు భర్తీలో అవకతవకలు

పంచాయతీ అధికారులకు ఫిర్యాదు



వీరవాసరం, ఫిబ్రవరి17: దూసనపూడి గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా నిర్వహణ పనుల నిమిత్తం అధికారులు టెండర్లు పిలిచారు. తక్కువ వేతనానికి టెండర్ వేసిన వ్యక్తిని కాదని అధిక టెండరు వేసిన వేరొకరికి పంపు ఆపరేటరు కొలువు అప్పగించారు. గతంలో పనిచేస్తున్న పంపు ఆపరేటరును తొలగించేందుకు ఉద్దేశపూర్వకంగానే ప్రజా ప్రతినిధులు, కార్యదర్శి వ్యవహరించారని చెబుతున్నారు. గ్రామంలో పంపు ఆపరేటరు నిమి త్తం టెండర్లు స్వీకరిస్తున్నామని దండోరా వేయించారు. ఒక పోస్టుకు నలుగురు టెండర్లు దాఖలు చేశారు.చాబత్తుల సునీల్ నెలకి వేతనంగా రూ.7,999 కి, చాబత్తుల లక్ష్మణరావు రూ.8,099కి ,కొల్లా ఆదిలక్ష్మి రూ.10,500కు, ఓదూరి వీరన్నబాబు రూ.8,430 కులకు టెండర్లు దాఖలు చేశారు. నిబంధనల మేరకు తక్కువ టెండరు వేసిన సునీల్‌ను పంపు ఆపరేటరుగా ఎంపిక చేయాల్సి ఉంది. కానీ రూ.8,430 లకు టెండరు వేసిన వీరన్నబాబును ఎంపికచేశారు. దీనిపై పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఆపరేటరు ఎంపికకు సంబంధించి అనుభవజ్ఞులను ఎంపిక చేయాల్సి ఉండగా అనుభవానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేయలేదు. నిబంధనలు విస్మరించి టెండర్లు తెరిచి వారికి ఇష్టమైన వ్యక్తికి టెండరును అంగీకరించారు. దీనిపై మిగిలిన వారు పంచాయతీ శాఖ అధికారులను ఆశ్రయించి విచారణ చేయాలని ఫిర్యాదు చేశారు.

పాపికొండల్లో చేపల మాఫియా

నిషేధిత వలలతో అక్రమంగా చొరబాటు

అడిగితే తుపాకులతో బెదిరింపులు

లక్షల విలువైన మత్స్య సంపద తరలింపు

అధికార పార్టీ ఎంపీపీ అండ

పోలవరం, ఫిబ్రవరి 17 : పాపికొండల అభయారణ్యంలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది అక్రమ చేపల వేట కొనసాగిస్తున్నారు. అడ్డుకోవడానికి వెళ్లిన స్థానిక నిర్వాసిత మత్స్యకారులపై తుపాకులు, వేట కొడవళ్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ఎగువన ఉన్న గ్రామాలన్నీ ఖాళీ చేయడంతో పాటు మత్స్యకారులను సైతం అధికారులు దిగువ ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో ఎగువ గ్రామాలు ఖాళీ కావడం ప్రాజెక్టు ఎగువన చేపల వేట లేకపోవడం వల్ల మత్స్య సంపద పెరిగింది. ఈ మత్స్య సంపదపై కొందరు అధికార పార్టీల నాయకుల కన్ను పడడంతో దోచుకోవడానికి సరికొత్త మార్గాలు ఎంచుకున్నారు. అధికార పార్టీకి చెందిన ఒక ఎంపీపీ అండదండలతో వేర్వేరు ప్రాంతాల నుంచి వందలాది మంది మత్స్యకారులు, పడవలు, చీరమేను అవిలీ (అప్పుడే పుట్టిన చేపలను పట్టే సన్న కన్నాలు గల వల) ఐలా అనబడే వలలతో పోలవరం ప్రాజెక్టు ఎగువన పాపి కొండల అభయారణ్యంలో మకాం వేశారు. చిన్న చేపలను సైతం వేటాడి అక్కడే ఎండబెట్టి తూర్పుగోదావరి జిల్లా పోశమ్మ గుడి ప్రాంతానికి తీసుకొచ్చి అక్కడి నుంచి లారీల్లో ఇతర ప్రాంతాల కోళ్ళ ఫారాలకు తరలిస్తున్నారు. కోళ్ళ దాణా చేపలకు గిరాకీ ఎక్కువ ఉండడం 50 కిలోల బస్తా ఒకటి రూ.16 వేలు పలుకుతుండడంతో రోజుకి ముప్పై లక్షల రూపాయల మత్స్య సంపదను తరలిస్తున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండడంతో అధికార పార్టీ నాయకులు వారికి కొమ్ము కాస్తూ అక్రమ దందాకు అండగా నిలిచి అధికారులను సైతం బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఈ దందా రెండు నెలల క్రితం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో



ప్రారంభం కాగా అక్కడి మత్స్యకారులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ నుంచి చేపల మాఫియా పాపికొండల అభయారణ్యంలో తమ దందా ప్రారంభించారు.

పోలవరం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన కొత్తూరు, కొండ్రుకోట, చీడూరు, టేకూరు నిర్వాసిత గ్రామాల మత్స్యకారులు పోలవరం ప్రాజెక్టు దిగువకు వచ్చిన తర్వాత మత్స్య సంపద తగ్గి ఉపాధి కోల్పోతుండడంతో అటు అటవీశాఖ అధికారులు, ఇటు ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు ఎగువన పరిమితి విధించిన మేర వేటాడుకుని తిరిగి వచ్చేలా వెసులుబాటు కల్పించారు. అయితే ఇటీవల చేపల మాఫియా చిన్న చిన్న చేపపిల్లలను కూడా పట్టి నిషేధిత వేట కొనసాగిస్తుండడంతో చేపల సంతతి తగ్గిపోయింది. దీంతో మత్స్య సంపద తగ్గి మత్స్యకారులు ఉపాధి కోల్పోతు న్నారు. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా వేట కొడవళ్లతో నాటు తుపాకులతో బెదిరించడంతో రక్షణ కల్పించాలంటూ స్థానిక మత్స్యకారులు అటవీ క్షేత్రాధి కారికి వినతిపత్రం సమర్పించారు. అక్రమంగా వేట సాగిస్తున్న మత్స్యకారులు సైతం ముంపు ప్రాంతాల వారేనని వారికి అండగా నిలిచిన ఆ ఎంపీపీ వంత పాడడంతో అటవీశాఖ అధికారులు ఇరు వర్గాల వారిని సమావేశ పరిచి ఎవరు స్థానికులు ఎవరు కాదనే విషయంపై స్పష్టత వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత వలలతో అక్రమ చేపల వేట చేస్తున్న మత్స్యకారులు ఈ ప్రాంతాలకు చెందిన వారు కాదని చేపల వేటతో పాటు అభయారణ్యంలో వన్యప్రాణుల వేట కూడా కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దీనిపై అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదు రాజుని వివరణ కోరగా గురువారం పోలవరం రేంజ్, గోకవరం రేంజ్ అటవీశాఖ సిబ్బంది పడవలలో వెళ్లి అక్రమ వేట సాగిస్తున్న వారిని పడవలు, వలలతో తూర్పుగోదావరి జిల్లా పోశమ్మ గండి ప్రాంతానికి తరలించి వేటకు వెళితే అటవీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపినట్టు తెలిపారు. అక్రమ దందాలకు సంపాదనకు అలవాటు పడిన చొరబాటు దారులు వేలేరుపాడు, కుక్కునూరు, కొయిదా, పోచవరం, పేరంటాలపల్లి ప్రాంతాల నుంచి వచ్చే అవకాశాలున్నాయని అటు వీఆర్‌పురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో అటవీశాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉండాలని మత్స్యకారులు కోరుతున్నారు.

తూర్పు నుంచి చొరబాటు..

పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ వైపు తూర్పుగోదావరి జిల్లా గోకవరం ప్రాంతం నుంచి చొరబాటుదారులు వస్తున్నా అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు, పోలవరం ప్రాజెక్టు చెక్‌పోస్టు అధికారులు మామూళ్ల మత్తులో అనుమతిస్తున్నారని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి వెళ్లాలంటే అనుమతులు ఉండాలని అధికారులు అధిక సంఖ్యలో మత్స్యకారుల్ని ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అభయారణ్యంలో గ్రామాలు ఖాళీ చేసి అటవీశాఖకు అప్పగించడంతో నదిలో మొసళ్లు, వన్య ప్రాణుల సంతతి పెరుగుతున్న తరుణంలో వేటలు కొనసాగిస్తుంటే వాటి మనుగడకు ప్రమాదమని వన్యప్రాణి ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ రైతులకు విత్తనాల పంపిణీ

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 17: కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పెరటితోటల పెంపకానికి 30 మంది ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తనాలందించారు. వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ దెబోరా, డాక్టర్ వినీయలక్ష్మి, ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి అందించారు. అలాగే ఎస్సీ సబ్‌ప్లాన్‌లో నవరసపురం గ్రామానికి చెందిన 30 మందికి రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలను ఉచితంగా ఇచ్చారు. ఏడీఈ అనిల్‌కుమారి మాట్లాడుతూ సబ్‌డివిజన్‌లోని నరసాపురంలో 8748 ఎకరాలు, మొగల్తూరులో 1162, యలమంచిలిలో 542 ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయన్నారు. ఎంటీయూ 1121, 1153, 1156, పీఆర్ 126 రకాల విత్తనాలను రైతులు సాగచేశారన్నారు. ప్రస్తుతం తెగుళ్లు ఎక్కువగా ఉన్నందున జింక్ సల్ఫేట్ ఎకరానికి 400 గ్రాములు లేదా జింకు 400గ్రాములు పురుగుల మందులు కలపకుండా పిచికారి చేయాలన్నారు దీని వల్ల తెగుళ్లను నివారించవచ్చున్నారు.

రహదారి ప్రారంభం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 17: నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం రూ.2.70 కోట్లతో నిర్మించిన లక్ష్మణేశ్వరం - పీతానిమెరక రహదారిని ప్రారంభించారు. సర్పంచ్ వెంకట్రాజు, మాజీ జడ్పీటీసీ చాగంటి సత్యనారాయణ, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబులు, అండ్రాజు చల్లారావు , దొంగ మురళీ పాల్గొన్నారు.

ప్రతి మహిళా స్వశక్తితో ఎదగాలి

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 17: ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యం పెంచుకుని స్వశక్తితో ఎదగాలని వైఎన్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం కాలేజీ పీజీ సెమినార్‌లో విశ్వకర్మయోజన పథకంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సింక్రోసర్వ్ వ్యవస్థాపకులు అడపా రాజా సురేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 28వేల మందికి ఈపథకానికి ఎంపికయ్యారన్నారు. 18రంగాలకు చెందిన వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కలెక్టర్



భీమవరం టౌన్, ఫిబ్రవరి 17: హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం దర్శించుకున్నారు. మందిర అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, అలయ అర్చకులు శ్రీనివాస చార్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక పూజలు చేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు రాజు, తహసీల్దార్ శివకుమార్, చెరుకువాడ రంగసాయి, సరిపిడకల రామారావు, జానపాటి మధుసూధన్ రావు పాల్గొన్నారు.

సంతకాల సేకరణకు ఐలు తీర్మానం


మాట్లాడుతున్న ఐలు జిల్లా అధ్యక్షురాలు శైలజ

తణుకు, ఫిబ్రవరి 17: భూ హక్కుల యాజమాన్య చట్టం రద్దు కోసం ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షురాలు వి.శైలజ అన్నారు. శనివారం తణుకు బార్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. భూ యాజమాన్య చట్టం రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ కోర్టుకు ఉండే హక్కులను తగ్గించడానికి ఈ చట్టాన్ని రాజకీయ నాయకులు తీసుకొచ్చారన్నారు. చట్టం రద్దు కోసం ప్రజలు నుంచి సంతకాలు సేకరించాలని కమిటీ తీర్మానించింది.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశ్వర్లు

తణుకు, ఫిబ్రవరి 17: ఆడ పిల్లలు గుడ్ టచ్ (మంచి స్పర్శ), బ్యాడ్ టచ్ (చెడు స్పర్శ)ల మధ్య తేడా గమనించాలని న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. కంతేరు జడ్పీ హైస్కూల్‌లో బాలికలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మగవారు ఆడ పిల్లలను తాకడానికి ప్రయత్నిస్తే హెచ్‌ఎం, తల్లిదండ్రుల దృష్టికి తేవాలన్నారు. న్యాయవాది ఎం. సుబ్బయ్య, హెచ్‌ఎం సూర్య కుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

గణాంక శాస్త్ర ప్రాముఖ్యత తెలుసుకోవాలి

తణుకు, ఫిబ్రవరి 17: ఉపాధి అవకాశాలు గల గణాంక శాస్త్రం ప్రాముఖ్యత తెలుసుకోవాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అన్నారు. శనివారం కళాశాలలో ఫాదర్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్ ఆర్.ఎ.ఫిషర్ జయంతి సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్టాటిస్టిక్స్ అధ్యాపకులు నాగరాజు, దీప్తి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రెండవ రోజుకు కాంట్రాక్టు కార్మికుల సమ్మె

పెనుమంట్ర, ఫిబ్రవరి 17: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పరిశోధన స్థానాలలో కాంట్రాక్టు కార్మికులకు జరిగే పాముకాటు, ఇతర ప్రమాదాలకు అధికారులే బాధ్యత వహించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శనివారం మార్టేరు ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ పెనుమంట్ర మండల కార్యదర్శి కోడి ప్రసాద్ మాట్లాడుతూ గుళికలు ఇతర ప్రమాదాలకు గురైన వారికి కాంట్రాక్టర్ ద్వారా కాకుండా వైద్యం విషయంలో అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సహజ, ప్రమాద మరణాలకు నష్టపరిహారంగా రూ. రెండు లక్షలు, ఐదు లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని అన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కాళ్ల, ఫిబ్రవరి 17 : జువ్వలపాలెం గ్రామంలోని తూర్పు పేటలో జడ్పీ నిధులు సుమారు రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు భూమి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ మీసాల శ్రీనివాస్, ఎంపీపీ పెన్మెత్స శిరీష, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, రుద్రరాజు రామకృష్ణంరాజు, ఉపసర్పంచ్ కఠారి లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల ప్రింట్‌కు టెండర్లు ఆహ్వానం

భీమవరం, ఫిబ్రవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేసే ఇళ్ల పట్టాలు ప్రింట్ చేయడానికి సీల్డ్ కవర్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఏజన్సీలు, కంపెనీలు, ఇతరులు ఎవరైనా సీల్డ్ కవర్ ద్వారా టెండరును ఈనెల 19 మధ్యాహ్నం 3గంటలలోపుగా భీమవరం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం కలెక్టరు కార్యాలయం ల్యాండ్ విభాగంలో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

సీసీ, బీటీ రోడ్ల ప్రారంభం

భీమవరం రూరల్, ఫిబ్రవరి 17: పట్టణంలో రూ.2కోట్ల 55లక్షల నిధులతో నిర్మించిన సీసీ, బీటీరోడ్లను, మరికొన్ని అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా నాచువారి సెంటర్‌లో సీసీ రోడ్డు, ఆర్‌సీసీ స్లాబ్ కల్వర్టును ప్రారంభించారు. సింహాద్రి అపన్న గుడి వద్ద బీటీ రోడ్డును, పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం శ్రీరామపురం కల్వర్టు వద్ద డిఎన్నార్ కాలేజీ వంతెన వరకు నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం, ఫిబ్రవరి 17: విద్యుత్ మరమ్మతులు కారణంగా ఆదివారం వీరవాసరంలో విద్యుత్ సరఫరాకు అతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బళ్ళ సురేష్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వీరవాసరం, వడ్డిగూడెం, తలతాడ తిప్ప, నందమూరుగరువు, పెర్కిపాలెం గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.





మొగల్తూరు ప్రధాన కాల్వ వద్ద టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి తదితరుల ఆందోళన.. కవిటంలో స్థానికులతో పితాని.. ఉప్పులూరులో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రామరాజు.. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి సమక్షంలో జనసేనలోకి చేరిక

'జగన్ మళ్లీ వస్తే రాష్ట్రం అధోగతి పాలు'

పోడూరు, ఫిబ్రవరి 17: జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలేనని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. కవిటం గ్రామంలో శనివారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పాదయాత్రలో పితానికి జనం నీరాజనాలు పలికారు. అడుగడుగునా మహిళలు ఆయనకు హారతులు పట్టారు. రైతులు పితానికి ఎదురువచ్చి కష్టాలను చెప్పుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు రుద్రరాజు వెంకటరామరాజు, గణపతినీడి రాంబాబు, మేడపాటి గంగాధరరెడ్డి, బీవికె.శివన్నారాయణ, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, దొంగ గవరయ్య, గుబ్బల అప్పన్నస్వామి పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కారంలో విఫలం

మొగల్తూరు, ఫిబ్రవరి 17: రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు ఆరోపించారు. శనివారం మొగల్తూరు ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగించాలంటూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ఆయన ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్తూరు మండలంలో కాలువలు ఆధునికీకరణ చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రైతులు, తీర గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు దృష్టిలో పెట్టుకుని తక్షణమే కాలువలు ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, కొపాఎడ రవీంద్రనాద్ ఠాగూర్, పాలా రాంబాబు, జోగి పండు, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్ బాబు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే అభివృద్ధి

ఉండి, ఫిబ్రవరి 17:జగన్నతో కాదు...చంద్రన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. శనివారం ఉప్పులూరులో ఇంటింటికి తెలుగుదేశం, బాబు ష్యూరిటీ వంటి కార్యక్రమాలతో గ్రామంలో ఎమ్మెల్యే రామరాజు సుడిగాలి పర్యటన గావించారు. ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ నూతన రాజధాని నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరాజు, గ్రామ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు లోకం సుబ్బారావు, వరసాల దాసన్న, ఉపాధ్యక్షుడు లింగం నాగవెంకట శేషగిరిరావు, మాజీ అధ్యక్షుడు యర్రా చిట్టిబాబు, యర్రా సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పులూరులో కాంగ్రెస్, ఇతరులు ఎమ్మెల్యే రామరాజు సమక్షంలో టీడీపీలో చేరారు.

'రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం'

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 17: వైసీపీ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. జనసేన పట్టణ ఉపాధ్యక్షుడు చాపల రమేష్, ఎజ్జల రమేష్, పింకి పవన్‌శ్రీను ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు శనివారం జనసేనలో చేరారు. బొలిశెట్టి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.




నరసాపురంలో ఉద్యోగుల ఆందోళన.. తాడేపల్లిగూడెంలో ఉద్యోగుల ఆందోళనకు టీడీపీ ఇన్‌చార్జి బాబ్జి మద్దతు.. ఆకివీడులో ఉద్యోగికి పోలీసు నోటీసు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం, ఫిబ్రవరి 17; ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలంటూ శనివారం జేఏసీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగులు ధర్నా చేశారు. సంఘం నాయకులు రామసుబ్బారావు, ఎం.మార్కండేయులు, కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించకుండా చర్చలతో కాలయాపన చేస్తుందన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగుల ధర్నాకు బాబ్జి మద్దతు తెలిపి మాట్లాడుతూ హామీని నెరవేర్చకుండా సీఎం జగన్ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఉద్యోగులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, ముప్పిడి రమేష్, ఎరుబండి సతీష్, పసలపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పోలీసుల నోటీసులు

ఆకివీడు, ఫిబ్రవరి 17: ఉద్యోగులకు పోలీసులు శనివారం నోటీసులిచ్చారు. సీపీఎస్ రద్దుచేయాలంటూ ఆదివారం ఛలో విజయవాడకు ఉద్యోగులు పిలుపునివ్వడంతో ముందస్తు చర్యల్లో భాగంగా వెళ్ళడానికి అనుమతులు లేవంటూ మండలంలో ఆరుగురు ఉద్యోగులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఏడీఆర్ భరత లక్ష్మి బదిలీ

పెనుమంట్ర, ఫిబ్రవరి 17 : మార్టేరు ప్రాంతీయ వ్యవసాయపరిశోధన స్థానం పరిశోధనా సహాయక సంచాలకులు డాక్టర్ ఎం.భరత లక్ష్మి బదిలీపై శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల డీన్‌గా వెళ్లారు. ఇక్కడ డీన్‌గా పని చేస్తున్న టి.శ్రీనివాస్ ఏ డిఆర్‌గా నియమించారు. సోమవారం శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టనున్నారు.

టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


తాడేపల్లిగూడెంలో మధ్యాహ్న భోజన పథకం పరిశీలిస్తున్న డీఈవో

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 17: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో ఆర్. వెంకటరమణ సూచించారు. తాళ్లముదునూరుపాడు మున్సిపల్ హైస్కూల్, జడ్పీ హైస్కూలులో ఆయన శనివారం మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. టెన్త్ విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయలు సిలబస్ పూర్తిచేసి విద్యార్థులకు రివిజన్ క్లాసులు తీసుకోవాలని సూచించారు. డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవో పీఎంకే జ్యోతి, హెచ్‌ఎంలు షైనం సత్యనారాయణ, నిమ్మల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెంటపాడు: 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెరిగేలా ఉపాధ్యాయులందరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డీఈవో ఆర్.వెంకటరమణ అన్నారు. శనివారం పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాలలో నిర్వహిస్తున్న టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆయన సందర్శించి మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈవోలు శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

దండగర్ర విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 17: ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో పర్యాటక, అటవీ మంత్రిత్వ శాఖ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ నిర్వహించిన పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో దండగర్ర జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రసంసా పత్రాలు అందుకున్నారు. వీరిని శనివారం హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 17: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డీసీహెచ్‌ఎస్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ. సూర్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో హెచ్‌ఐవీపై అవగాహన కళాజాతను శనివారం ఆయన ఏరియా ఆసుపత్రి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మిరియాల రవిబాబు కళాజాత బృందం అవగాహన కల్పించింది.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

మొగల్తూరు, ఫిబ్రవరి 17: గోగులమ్మపేటలో కమ్యూనిటీ భవనం, మొగల్తూరు నాలుగవ గ్రామ సచివాలయ భవనం, ఇదే సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ముక్కువారివీధిలో సీసీ రోడ్డు, మొగల్తూరు 1వ గ్రామ సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. మొగల్తూరులోని కోనాయికోడు నుంచి నాలుగవ గ్రామ సచివాలయం వరకు నూతనంగా నిర్మించే సీసీ రోడ్డుకు ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది కేవీ రమేశ్

వీరవాసరం, ఫిబ్రవరి 17:విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండా లని న్యాయవాదులు కేవీ రమేష్, సి.జ్వాలా శ్రీనివాసులు అన్నారు. ప్రతీ ఉద్యోగి, విద్యార్థి లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శనివారం వీరవాసరం డిగ్రీకళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


ఠాకూర్ చిత్రపటానికినివాళులు అర్పిస్తున్న నాయీ బ్రాహ్మణులు

కర్పూరి ఠాకూర్‌కు నివాళులు

ఆచంట, ఫిబ్రవరి 17: అత్యంత వెనుకబడిన తరగతుల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ చేసిన సేవలు విలువ కట్టలేనివని నాయీ బ్రాహ్మణుల క్షౌర వృత్తిదారుల సంఘం గౌరవాధ్యక్షుడు తోటపల్లి సత్యనారాయణ అన్నారు. కర్పూరీ ఠాకూర్ 36వ వర్ధంతిని శనివారం స్థానిక మదన గోపాల స్వామి ఆలయం సమీపంలో నిర్వహించారు.

దర్భరేవులో రంగా విగ్రహావిష్కరణ

నరసాపురం, ఫిబ్రవరి 17: రంగా ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కాదని, ఆయన ప్రజల సమస్యల కోసం పోరాడి ప్రాణాల్పరించిన గొప్ప నాయకుడని పలువురు నాయకులు కీర్తించారు. మండలంలోని దర్భరేవు గ్రామంలో శనివారం రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధా ఆవిష్కరించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, పొత్తూరి రామరాజు, బొమ్మిడి నాయకర్, కొవ్వలినాయుడు, వలవల నాని తదితరులు పాల్గొన్నారు.

నాటిక పోటీల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 17: పాలకొల్లు కళా పరిషత్ 15వ జాతీయ స్థాయి నాటిక పోటీల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణ వర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఆహ్వాన పత్రికను కేవీ కృష్ణ వర్మ ఆవిష్కరించి తొలి ఆహ్వాన పత్రికను సంస్థ గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కెస్ పీఎస్ వర్మకు అందజేశారు.

కళా ప్రోత్సాహకుడు భట్టిప్రోలు

నేడు వర్ధంతి



భీమవరం టౌన్, ఫిబ్రవరి 17 : మాటలకందని మధుశ్రీ రచనలతో చరిత్రకెక్కిన పాత్రికేయ విమర్శకుడు, కళా ప్రోత్సాహకుడు భట్టిప్రోలు మధుసూధనరావు. మధుశ్రీకలం పేరుతో సినీ రంగానికి ఆయన సుపరిచితులు. మధుసూధన రావు 1986 ఫిబ్రవరి 18న తుది శ్వాస విడిచారు. నేడు ఆయన వర్ధంతి. భీమవరంలో కురిశేటి వారి వ్యాపారసంస్థల్లో మూడు దశాబ్దాలపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు సినిమా జర్నలిజం అంటే మక్కువ. మధుశ్రీ పేరుతో ఆయన ఎన్నో రచనలు చేశారు. 1965లో ఫిలిం జర్నలిస్టుగాను, భీమవరం ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్ కార్యదర్శిగాను, రాష్ట్ర ఫిలిం ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడిగా, భీమవరం ప్రెస్ క్లబ్ కోశాధికారిగా, అంకాల ఆర్ట్స్ అకాడమీ, శ్రీరామరాజభూషణ సాహిత్య పరిషత్ కార్యవర్గ సభ్యునిగా అనేక పదవుల్లో పని చేశారు. 1965 లో రాష్ట్ర ఫిలిం ఫ్యాన్స్ మహాసభలు భీమవరంలో నిర్వహించారు. ప్రసిద్ధ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, మధుర గాయకుడు ఘంటసాల వంటి ప్రముఖులను భీమవరం తీసుకువచ్చి తమ సంస్థ ద్వారా సన్మానించేవారు. ప్రముఖ గాయకుడు పీఠాపురం నాగేశ్వరరావుకు ఆంధ్రా రఫీ అనే బిరుదుతో సత్కరించారు.


స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక దీపాలంకరణ

కాళ్ళకూరు వెంకన్నకు ఊంజల్ సేవ

కాళ్ళ, ఫిబ్రవరి 17: కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన ఊంజల్ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన అద్దంకి తిరుమల వెంకట ప్రసాద్, వెంకట రాజ్యలక్ష్మీ దంపతులచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది.

వైభవంగా శ్రీసత్తెమ్మ జాతర ప్రారంభం


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

ఉండి, ఫిబ్రవరి 17: శ్రీసత్తెమ్మ జాతర అంగ రంగ వైభవంగా ప్రారం భమైంది. పెదపుల్లేరులో ఈనెల 25వ తేదీ వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన కలిదిండి వారి ఆడపడుచు శ్రీసత్తెమ్మ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కలశస్థాపన, కుంకుమ పూజలు నిర్వహించారు. కలిదిండి అప్పలరాజు(షావుకారు అప్పలరాజు)వారి కుమారులు అమ్మవారికి అలంకరణ, ప్రసాదాలు చేయించారు. సాయంత్రం బాణ సంచా కాల్పులు, మేళతాళాలు, గరగల నృత్యాలు, విచిత్ర వేషధారణలు, కాళికా నృత్యాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం 108 కలశాలతో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు

ఆకివీడు, ఫిబ్రవరి 17: శరీరంలో దంతాలు ఒక భాగమని వాటిని జాగ్రత్తగా కాపాడుకోకపోతే సమస్యలు తప్పవని విష్ణు డెంటల్ కళాశాల వైద్యులు చైతన్య అన్నారు. శనివారం ఆదర్శ లయన్స్ క్లబ్, విష్ణు డెంటల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో షాదీఖానాలో ఉచిత డెంటల్ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యుడు బిలాల్, క్లబ్ నేతలు మోటుపల్లి శ్రీను, దాట్ల రామరాజు, దా సరి సత్యనారాయణ, అహ్మద్, శ్రీనివాసరాజు,పుప్పాల పండు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శివ పలకరింపు



ఆకివీడు, ఫిబ్రవరి 17: ముస్లీం మైనార్టీ పెద్ద ఎండీ మదనీని ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా శనివారం ఆయన ఇంటికి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) వెళ్ళి పలకరించారు. ఈయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, ముస్లిం మైనార్టీ నేతలు ఆరీఫ్, అజ్మల్, రైతు నాయకుడు ఇల్లాపు అప్పారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఉండి, ఫిబ్రవరి 17 : చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని భీమవరానికి చెందిన ప్యానల్ లాయర్లు పి.అంబేద్కర్, సురేష్‌కుమార్ అన్నారు. శనివారం చెరుకువాడ సచివాలయం వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. లాయర్లు మాట్లాడుతూ మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కేసులను రాజీ చేసుకునేందుకు ఇదొక చక్కని అవకాశమన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ కొండవీటి సాంబశివరావు, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈవోపీఆర్‌డీ కొండలరావు, గ్రామ కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం డీఎస్పీగా మూర్తి



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 17: తాడేపల్లిగూడెం డీఎస్పీగా వీఎస్ఎన్ మూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తాడేపల్లిగూడెం డీఎస్పీగా పనిచేస్తున్న శరత్‌రాజ్‌కుమార్ బదిలీ కావడంతో మూర్తి శనివారం విధుల్లో చేరారు. అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

24న సాగరతీరంలో పౌర్ణమి ధ్యానం

మొగల్తూరు, ఫిబ్రవరి 17: కెపిపాలెం సాగరతీరంలో పాండురంగస్వామి ఆలయం వద్ద ఈనెల 24న పౌర్ణమి ధ్యానం నిర్వహిస్తున్నట్లు జిల్లా పిరమిడ్ సొసైటీల అధ్యక్షుడు కేవీడీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్‌ల జ్ఞాన సందేశాలతో పాటు పిప్పళ్ళ ప్రసాదరావు బృందంతో సంగీత విభావరి, కోలాట నృత్యప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన ఉజ్జీవ కూటములు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 17: ది లేమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో ఉజ్జీవ కూటములు శనివారం రాత్రితో ముగి ముగిశాయని పాస్టర్ జయంతి రావు తెలిపారు ముఖ్య ప్రసంగికులుగా కాలెబ్ డానియల్ (బెంగళూరు), సురేష్ మార్కస్ (చెన్నై) లు దేవుని వాక్యాన్ని అందించారు జిల్లా నలుమూల నుంచి అనేక మంది వచ్చి దేవుని వాక్యాన్ని ఆలకించారు.

హక్కుల సాధనకు సంఘటితం కావాలి

ఉండి, ఫిబ్రవరి 17: బుడగ బేడ జంగాల హక్కుల సాధనకు సంఘటితం కావాలని జిల్లా సీపీఐ కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శనివారం ఉండి జంగాలకాలనీలో సమావేశం జరిగింది. భీమారావు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎలాంటి అభివృద్ధికి నోసుకోక తీవ్ర వెనుకబాటుకు గురవుతున్న బుడగ, బేడాజంగాలు హక్కుల సాధనకు సంఘటితం కావాలన్నారు.